# భీంగల్ అభివృద్ధిపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం.. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్ట్..

నా గొంతు నొక్కలేరు..జైల్లో పెట్టిన ప్రజలకోసం పోరాటం ఆగదు..

రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యే వేముల..

ఆసుపత్రి, బస్ డిపో సాధనకై దీక్ష.. పోలీసుల పహారాలో స్వగృహంలోనే దీక్ష కొనసాగింపు..

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట తప్పారు.. కాంగ్రెస్ హామీలు నీటి మూటలే..






**నవగీతం, భీంగల్ ప్రతినిధి** :బాల్కొండ నియోజకవర్గం భీంగల్ పట్టణ అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఒకరోజు నిరాహార దీక్షకు పూనుకున్న బాల్కొండ శాసనసభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా సమస్యల పరిష్కారం కోసం దీక్ష చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి భయమెందుకని ఆయన సూటిగా ప్రశ్నించారు. పోలీసుల ఆంక్షల నడుమ ఆయన బుధవారం తన స్వగృహంలోనే నిరాహార దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గత బీఆర్ఎస్ (కేసీఆర్) ప్రభుత్వం భీంగల్ ప్రజల వైద్య అవసరాల కోసం వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేసిందని, ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన 20-25 శాతం పనులను పూర్తి చేయాలని గత రెండున్నరేళ్లుగా అసెంబ్లీలో, భీంగల్ వేదికగా అనేక పోరాటాలు చేసినా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అలాగే, గతంలో తమ ప్రభుత్వం భీంగల్ కు తీసుకొచ్చిన బస్ డిపోను కాంగ్రెస్ ప్రభుత్వం మూసివేసిందని, దానిని తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.తమ ప్రభుత్వ హయాంలో భీంగల్ సీసీ రోడ్ల కోసం రూ. 12 కోట్లు మంజూరు చేశామని, అయితే మొన్నటి మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల లబ్ధి కోసం తూతూ మంత్రంగా కొబ్బరికాయలు కొట్టి పనులు మొదలుపెట్టారని విమర్శించారు. నేటికీ ఆ పనులు పూర్తి కాలేదని, రోడ్ల పై కంకర వేసి వదిలేశారని, కనీసం డాంబర్, సీసీ రోడ్లు వేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భీంగల్ మార్కెట్ పనులు సైతం ఎక్కడికక్కడే నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నాలుగు ప్రధాన డిమాండ్ల సాధనకై తాను భీంగల్ లో ఒకరోజు నిరాహార దీక్షకు పిలుపునిచ్చానని, దీక్షకు అనుమతి కోరుతూ పోలీసులకు (సీపీ , ఏసీపీ,) ముందస్తు సమాచారం ఇచ్చామని తెలిపారు. అయితే పై అధికారుల ఆదేశాలు ఉన్నాయని చెబుతూ, బుధవారం వేకువజామునే పోలీసులు తన ఇంటిని చుట్టుముట్టి తనను బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని తెలిపారు. భీంగల్ లో దీక్ష కోసం ఏర్పాటు చేసిన టెంట్లను, స్టేజిని తొలగించడమే కాకుండా, ప్రజలు మరియు కార్యకర్తలు కట్టిన ఫ్లెక్సీలను సైతం పోలీసులు చించివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తనను అడ్డుకున్నంత మాత్రాన ప్రజా సమస్యలపై పోరాటం ఆగదని స్పష్టం చేస్తూ, తన ఇంట్లోనే సాయంత్రం వరకు దీక్షను కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భీంగల్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. మూడు నెలల్లో ఆసుపత్రిని తెరిపిస్తామని ప్రగల్భాలు పలికిన నాయకులు, ఐదు నెలలు గడుస్తున్నా ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. కనీసం ఒక బాధ్యతాయుతమైన నాయకుడిగా ప్రభుత్వం తరపున వచ్చి "ఇన్ని నెలల్లో పనులు పూర్తి చేస్తాం" అని రాతపూర్వక హామీ ఇచ్చి ఉంటే తాను దీక్షను విరమించుకునే వాడినని, ప్రజల పక్షాన తనను తాను శిక్షించుకుంటూ దీక్ష చేస్తుంటే ప్రభుత్వానికి ఎందుకు అంత ఉలుకు అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు.. భీంగల్ లో వంద పడకల ఆసుపత్రి ప్రారంభమయ్యే వరకు, మూతపడిన బస్ డిపోను తెరిపించే వరకు, మార్కెట్ మరియు అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల పనులు పూర్తయ్యే వరకు తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని శ్రీ ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ న్యాయమైన పోరాటంలో బాల్కొండ నియోజకవర్గ, భీంగల్ పట్టణ ప్రజలు, కార్యకర్తలు తనకు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు..

# ప్రజలకు సత్వర న్యాయం, విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి







మహిళల భద్రతకు ప్రాధాన్యం --- నేరాల నియంత్రణకు కఠిన చర్యలు



**నవగీతం, జగిత్యాల:** వార్షిక తనిఖీల్లో భాగంగా కథలాపూర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తనిఖీ చేశారు.ఈ తనిఖీ సందర్భంగా ఎస్పీ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, జనరల్ డైరీ, ఆర్మ్ రూమ్, స్టోర్స్, లాకప్ రూమ్‌లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను రివ్యూ చేసి, విచారణలో ఉన్న కేసుల పురోగతిపై సమీక్ష జరిపారు. స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల స్థితిగతులపై సవివరంగా అడిగి తెలుసుకున్నారు.ఎస్పీ మాట్లాడుతూ .. ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలి. ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. గతంతో పోల్చుకుంటే నేరాల రేటు తగ్గుముఖం పట్టింది. ప్రజలు పోలీసులపై విశ్వాసం ఉంచి అసాంఘిక కార్యకలాపాలు గమనించిన వెంటనే సమాచారం అందించాలి అని సూచించారు.అలాగే మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల వ్యసన నిర్మూలన, యువతలో చట్టం పట్ల గౌరవం పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. కేసుల విచారణలో స్పీడ్ ఇన్వెస్టిగేషన్, సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని సూచించారు.ఈ సందర్భంగా రిసెప్షన్ వర్టికల్ నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు ను పిటిషన్ మేనేజ్మెంట్లో ఎంట్రీ చేసిన డాటా ను తనిఖీ చేశారు. రిసెప్షన్‌ఈస్ట్ గా ప్రతి దరఖాస్తు పై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో జనరేట్ చేసినా రిసిప్ట్ ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5యా విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా గా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలి అని సూచించారు. తనిఖీ అనంతరం ఎస్పీ గారు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పచ్చదనం, పరిశుభ్రతపై ప్రతి పోలీస్ సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సి.ఐ లక్ష్మీనారాయణ. డీసీఆర్బీ ఎస్.ఐ ప్రదీప్, కథాలపూర్ ఎస్సై రవి కిరణ్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ చేసిన పాపాలే రాష్ట్రానికి శాపాలు : మానాల



**నవగీతం,భీంగల్ ప్రతినిధి** :గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పాపాలే నేడు తెలంగాణ రాష్ట్రానికి శాపాలుగా మారాయని కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భీంగల్ అభివృద్ధిపై చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన కొట్టిపారేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో భీంగల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. భీంగల్ లో వెజిటబుల్ మార్కెట్కు 2021లో, వంద పడకల ఆసుపత్రికి 2022లో శంకుస్థాపనలు చేశారని మానాల మోహన్రెడ్డి గుర్తుచేశారు. తర్వాత అధికారంలో ఉండి కూడా వాటిని ఎందుకు పూర్తి చేయలేదని వేములను ప్రశ్నించారు.

## సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ సొంత భవన నిర్మాణానికి స్థల పరిశీలన..



**నవగీతం,భీంగల్, ప్రతినిధి:** భీంగల్‌లో ప్రతిపాదిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ సొంత భవనం నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ స్థలాన్ని పరిశీలించడం జరిగింది . ప్రతిపాదిత స్థలం అనుకూలత, విస్తీర్ణం, రవాణా సౌకర్యం, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు సొంత భవనం నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు అభిప్రాయపడ్డారు. త్వరితగతిన అవసరమైన పరిపాలనా ప్రక్రియలు పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థల పరిశీలన కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ చైర్మన్ కన్నె సురేందర్, వైస్ చైర్మన్ జేజే నర్సయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగేంద్ర బాబు, కౌన్సిలర్ సందీప్ పాల్గొన్నారు.

## అడవి బిడ్డలకు అండగా 'బ్రదర్ ఇశ్రాయేల్' బృందం

మేడేపల్లి గిరిజన గ్రామంలో నిత్యావసరాలు, పాఠశాల వస్తువుల పంపిణీ

అడవి ప్రాంతంలో ఆకలి తీర్చి, అక్షర దీపం వెలిగించిన బ్రదర్ కే.వి. ఇశ్రాయెల్ బృందం.





**నవగీతం తల్లాడ ప్రతినిధి:** తల్లాడ సుమారు 12కిలోమీటర్ల దూరంలో, దట్టమైన అడవి ప్రాంతంలో ఉన్న మేడేపల్లి గిరిజన గ్రామంలో బుధవారం బ్రదర్ కే.వి. ఇశ్రాయెల్ బృందం ఆధ్వర్యంలో ముందడుగు వేసి భారీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సరైన రహదారి మార్గాలు లేక, కమ్యూనికేషన్ వ్యవస్థ, విద్యుత్, కనీస రవాణా సౌకర్యాలకు నోచుకోక తీవ్ర పేదరికంలో మగ్గుతున్న 60 గిరిజన కుటుంబాల పరిస్థితిని చూసి చలించిన బ్రదర్ ఇశ్రాయేలు వారికి అండగా నిలిచారు. గ్రామంలోని పదేళ్ల లోపు వయసున్న 50 మంది చిన్న పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి చదువుకోవడానికి అవసరమైన పెన్నులు, పలకలు, నోట్‌బుక్కులతో పాటు నిత్యం వాడుకునే ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని 20 మంది వృద్ధులకు నూతన చీరలు, స్వీట్లు, బస్సులు (ప్రయాణ ఖర్చులు/రవాణా సాయం) అందించి వారి ముఖాల్లో ఆనందాన్ని నింపారు. ?ఈ సేవా కార్యక్రమంలో బ్రదర్ కే.వి. ఇజ్రాయెల్‌తో పాటు గొల్లమందల దేవా సహాయం, గుంటి బాబురావు, నిరీక్షణ రావు, ఎలిషా అమ్మగారు, పాము తిమోతి తదితరులు పాల్గొని గిరిజనులకు వస్తువులను అందజేశారు. కనీస సౌకర్యాలు లేని ఈ మారుమూల ఏజెన్సీ గ్రామానికి వచ్చి తమను ఆదుకున్నందుకు మేడేపల్లి గ్రామస్తులు బృంద సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

